



## గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

పాత శ్రీకాకుళం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 25 ప్రవేశపరీక్షకు హాజరైన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. పెద్దపాడు గురుకుల పాఠశాలలో బాలికలు ఉదయం 9 నుంచి 1 గంట వరకు, బాలురకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఇతర వివరాలకు 970173 6862, 90003 14209 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# తొలి ఏకాదశి... శుభాల రాశి

- నేటి నుంచే విష్ణుమూర్తి యోగనిద్ర
- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



నరసన్నపేటలో వజ్రకిరీటంతో వేంకటేశ్వర స్వామి దర్శనం

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం హిర మండలంలోని కూర్మ ఆధ్యాత్మిక గ్రామం, శ్రీకూర్మం, శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమల... నరసన్నపేటలోని శ్రీ వేంకటేశ్వర, సత్యనారాయణస్వామి దేవాలయం, టెక్కలి, సోంపేట, కాశీబుగ్గ, ఆమదాలవలసలోని విష్ణు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

● ఏకాదశిలు నెలకు రెండు చొప్పున వస్తుంటాయి. ఆషాఢ మాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశికి ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం చైత్రశుద్ధ పాడ్యమిని సంవత్సర ఆరంభంగా.. తెలుగు సంవత్సరాది (ఉగాది)గా జరుపుకుంటున్నాం. కానీ.. గతంలో ఆషాఢ శుక్ల ఏకాదశిని సంవత్సర ఆరంభంగా పరిగణించేవారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిల్లో ఇది మొదటిగా ఉండేది. అందుకే దీనిని తొలి ఏకాదశి అంటారు. తొలి ఏకాదశికి ఆధ్యాత్మిక పరంగాను, ఆరోగ్యపరంగాను అనేక విశిష్టతలు ఉన్నాయని పెద్దలు చెబుతారు. ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామిజీలు ఈ రోజు నుంచే నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షను చేపడతారు. ఇక అనేక పండుగలకు ప్రారంభం కూడా తొలి ఏకాదశి నుంచే జరుగుతుంది. తొలి ఏకాదశిని శయన ఏకాదశిగా కూడా పిలుస్తారు. ఆ రోజు శ్రీమహావిష్ణువు పాలకడలిపై యోగ నిద్రకు ఉపక్రమిస్తారు. తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజు అంటే నాలుగు నెలల తర్వాత ఆయన యోగ నిద్ర నుంచి మేల్కొంటారు. అందుకే దాన్ని ఉత్థాన ఏకాదశిగా పిలుస్తారు. తొలి ఏకాదశి రోజున విష్ణుమూర్తిని పూజించటం... విష్ణు సహస్రనామ పారాయణం చేయడం ఎంతో ఉత్తమమని చెబుతారు. తొలి ఏకాదశి రోజు నుంచే గ్రహ గమనాల్లో మార్పులు ప్రారంభమవుతాయి. ఈ రోజు నుంచి ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లు కనిపిస్తాడు. అందుకే పగలు తక్కువగా ఉండి... రాత్రి సమయం పెరుగుతుంది. ఈ విధంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన తొలి ఏకాదశి పండుగను సర్వపాపాలను హరించే పుణ్యరాశిగా పేర్కొంటారు.

# మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం

- నేడు జిల్లాలో నిర్వహణకు ఏర్పాట్లు



కూర్మనాథపురంలో సిద్ధం చేసిన పీర్లు

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మొహర్రం... ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల. దీన్ని శోకానికి... సంతాపానికి గుర్తుగా పరిగణిస్తారు. ముఖ్యంగా షియా ముస్లింలు ఈ నెలలో ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని స్మరించుకుంటారు. మొహర్రం పదో రోజును ఆషురా అని పిలుస్తారు. ఇది కర్బలా యుద్ధంలో హుస్సేన్, అతని అనుచరుల మరణాన్ని స్మరించుకునే రోజు. మొహర్రం అనేది వాస్తవానికి పండుగ కాదు. సహన్, హుస్సేన్ అనే ముస్లింవీరుల స్మారకార్థం శోకతప్త హృదయాలతో జరుపుకునే కార్యక్రమం. పది రోజులపాటు జరిగే కార్యక్రమాలలో ఇస్లాంకు సంబంధించిన ప్రవచనాలు, మహ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తాయి. హిజ్రీ శకం ప్రకారం మొహర్రంను మొదటినెలగా పరిగణిస్తారు. నెలవంక ఆధారంగా ఈ మాసానికి... దీనిలోని పదో రోజుకూ ప్రాధాన్యం ఏర్పడింది. పదోరోజున హజ్రత్ ఇమాం హుస్సేన్‌కు గుర్తుగా పంజా(పీర్లు) ప్రతిమలను ఊరేగించి సంతాపం ప్రకటిస్తారు.

### జిల్లాలో ఇలా...

శ్రీకాకుళంలోని జెండా వీధిలో ఆదివారం రాత్రి (మొహర్రం) అగ్ని గుండాల మీద ముస్లింలు నడుస్తారు. జలుమూరు మండలం కూర్మనాథపురం గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా హిందువులే ఈ పండుగను ఎంతో పవిత్రంగా చేస్తారు. ఇచ్ఛాపురం వద్ద పీర్ల కొండపై కూడా మొహర్రం పండుగ జరుపుకుంటారు. మొహర్రం సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

### అప్పటి సంప్రదాయం

శత్రువుల చేతిలో 70 మంది వరకు మహమ్మద్ ప్రవక్త వంశానికి చెందిన వారు అమరులవుతారు. ఈ సందర్భంగా హజ్రత్ హుస్సేన్ తమ శత్రువుల తెగకు శాపం పెడతారు. ఈ తెగకు ఎప్పటికీ మోక్షం ఇవ్వవద్దని అల్లాహోను ప్రార్థిస్తూ ప్రాణాలు విడుస్తారు. యుద్ధానంతరం యజీద్ తెగకు చెందిన వారు పశ్చాత్తాపం చెంది.. 'దేవుడా మేం తప్పు చేశాం.. దైవ ప్రవక్త మహ్మద్ ప్రవక్త వంశానికి చెందిన వారిని మా చేతులతో హతమార్చాం.. కాబట్టి మమ్మల్ని మన్నించమని గుండెల మీద చేతులతో బాదుకుంటూ బిగ్గరగా ఏడుస్తూ నిప్పులపై నడుస్తారు. అప్పటి నుంచి ప్రారంభమైన అగ్ని గుండం మీద నడిచే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది.



- ఇదీ ఫౌండేషన్ స్కూళ్లలో పరిస్థితి
- కొన్నిచోట్ల ఇద్దరు విద్యార్థులకు ఒక టీచరు
- అన్ని సదుపాయాలు ఉన్నా చేరేవారు లేరు
- దృష్టిపెట్టని ఉపాధ్యాయులు, అధికారులు

పెద్దకొజ్జిరియా ఉన్నత పాఠశాల

# ఒక గురువు ఒక విద్యార్థి..



పెద్దకొజ్జిరియాలో మూడో తరగతి విద్యార్థిని జాహ్నవికి బోధిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడు



పెద్దకొజ్జిరియాలో ఐదో తరగతి విద్యార్థిని సంధ్యకి పాఠాలు చెబుతున్న టీచర్ భార్గవి

జలుమూరు/కంచిలి, జూలై 5(ఆంధ్రజ్యోతి):

ఫౌండేషన్ స్కూళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చాలా పాఠశాలలు ఒకరిద్దరు విద్యార్థులతోనే నడుస్తున్నాయి. వీరికి బోధించేందుకు ఓ టీచర్‌తో పాటు ఒక వంట మనిషి, ఒక ఆయా పనిచేయాల్సి వస్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా, అదనపు భారం పడుతున్నా- వాటిని మూసివేయకూడదనే ఉద్దేశంతో ఫౌండేషను స్కూళ్లను ప్రభుత్వం నడిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రాథమిక పాఠశాలలను 1, 2 తరగతులకే పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 1, 2 తరగతులతో నడుస్తున్న ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లగా మార్పుచేసింది. దీంతో జలుమూరు మండలంలోని యడ్లవానిపేట, హుస్సేనుపురం, చల్లవానిపేట, కరవంజ, వెలుసోద ప్రాథమిక పాఠశాలలు ఫౌండేషన్ స్కూళ్లగా మారాయి. ప్రస్తుతం హుస్సేనుపురంలో ఒక విద్యార్థి మాత్రమే ఉన్నాడు. ఈ బాలుడికి బోధించేందుకు ప్రభుత్వం ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. అలాగే, ఒక వంట మనిషి, ఒక ఆయా కూడా ఇక్కడ పని చేస్తున్నారు. అదే విధంగా యడ్లవానిపేట స్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు ఒక టీచర్, వంట మనిషి, ఆయా ఉన్నారు. వెలుసోద ఫౌండేషన్ స్కూల్ ఐదుగురు, కరవంజలో ఏడుగురు, చల్లవానిపేట స్కూల్‌లో 13 మంది విద్యార్థులు ఈ ఏడాది చదువుతున్నారు.



జలుమూరు: యడ్లవానిపేట ఫౌండేషన్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఒకే ఒక్క విద్యార్థి. పక్కన ఉపాధ్యాయుడు, వంట మనిషి

● కంచిలి మండలం పెద్దకొజ్జిరియా ఫౌండేషన్ పాఠశాలలో శ్యామలా గౌరవ్ అనే విద్యార్థి ఒకటో తరగతిలో చేరాడు. ఇక్కడ పని చేసేందుకు ఓ ఉపాధ్యాయురాలిని ప్రభుత్వం నియమించింది. పెద్దకొజ్జిరియా ఉన్నత పాఠశాలలో మూడు నుంచి పది తరగతులకు సంబంధించి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మూడో తరగతిలో ఒక విద్యార్థి, ఐదో తరగతిలో ఇద్దరు విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఒక్క ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని నియమించారు. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉండగా, ఏడుగురు ఉపాధ్యాయులు పని చేశారు. ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులు మానేశారు. అలాగే, బదిలీలు జరగడంతో ఆరుగురు ఉపాధ్యాయులు ఇతర మండలాలకు వెళ్లిపోయారు. ఒకరిని డిప్యూటేషన్‌పై ఇచ్ఛాపురం పాఠశాలకు పంపించారు. దీంతో ముగ్గురు విద్యార్థులు, ఒక ఎంటీఎస్ (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న మంత్రి కె.శ్రీనివాస్, పక్కన మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్

# పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకుని పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. లక్ష్యసాధనకు ప్రతీ ఒక్కరూ సహకరించాల'ని ఎంఎస్ఎంఈ, ఎన్నారై, సెర్ప్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్ అధ్యక్షతన 'విజన్-2047' సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ 'రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన 20శాతం కుటుంబాలను ఆదుకోవడానికి, ఆర్థికంగా పునరుద్ధరించడానికి పీ-4 కార్యక్రమం ప్రారంభించాం. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ధనవంతులు మార్గదర్శులుగా నిలిచి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి. ఆ కుటుంబాలకు నేరుగా మార్గనిర్దేశం, ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యం. ఇందుకుగాను నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్ తయారు చేసి, అమలు చేస్తాం. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాల'ని కోరారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో 10 శాతం అత్యధిక ధనవంతులను గుర్తించి 20శాతం పేద కుటుంబాలను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటాం. గ్రామ/వార్డు సచివాలయా డేటా ఆధారంగా పీ-4 సర్వేను చేశాం. దీని ద్వారా జిల్లాలో 75,566 బంగారు కుటుంబాలను గుర్తించామ'ని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని (మిగతా 8వ పేజీలో..)

### ● దీర్ఘకాలిక అభివృద్ధి: మంత్రి అచ్చెన్నాయుడు

పీ-4 కేవలం దాతృత్వానికే పరిమితం కాదని, దీర్ఘకాలిక అభివృద్ధే లక్ష్యం కావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. గ్రామాల్లో సచివాలయ సీనియర్ సిబ్బంది, ఇతర అధికారులు, నాయకులు ఒకరు లేదా ఇద్దరు మార్గదర్శులను గుర్తించాలని తెలిపారు. దీనివల్ల కార్యక్రమం నిర్దేశిత సమయంలో విజయవంతమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ దిశగా అధికారులు ముందడుగు వేయాలని సూచించారు. పీ-4ను జయప్రదం చేస్తే.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతందని స్పష్టం చేశారు.

## 10న మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'చదువులో విద్యార్థుల పురోగతి, వారి ఆరోగ్య వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. అన్ని పాఠశాలల్లో తల్లికి వందనం, షైనింగ్ స్టార్స్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. విద్యార్థులందరూ ఆ రోజున యూనిఫారం ధరించి రావాలి. అవసరమైన కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల'ని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా
- 2,826 కేసుల పరిష్కారం

శ్రీకాకుళం లీగల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్‌మౌలానా అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 19 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, తద్వారా 2,826 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో సివిల్, ప్రీలిటిగేషన్, మోటార్‌వెహికల్ బీమా కేసులు ఉన్నాయన్నారు. సుమారు రూ.7కోట్లు నష్టపరిహారంగా కక్షిదారులకు అంద జేసినట్లు చెప్పారు. జిల్లా కోర్టుకు వచ్చిన రెండు కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహించి రాజీకుదర్చడం తనకు ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పి.భాస్కరరావు, సీహెచ్.వివేకానంద శ్రీనివాస్, ఫణికుమార్, ఎం.శ్రీధర్, శాంతిశ్రీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాసు మెజిస్ట్రేట్ జన్రత్ బేగం, జిల్లాబార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా, న్యాయాధికారులు



శ్రీకాకుళం: రథయాత్రలో పాల్గొన్న భక్తులు

# జై జగన్నాథ

- ఘనంగా మారు రథయాత్ర

శ్రీకాకుళం కల్చరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి మారు రథయాత్రను శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. బొందిలీపురంలో ఉన్న సదావర్తి పలహారి తఖియా మందిరానికి బలబద్ర, సుభద్ర ల సమేతంగా జగన్నాథ స్వామిని రథంలో ఊరేగింపుగా తరలించారు. జై జగన్నాథ అంటూ స్వామి వారి నామస్మరణతో భక్తులు పులకించారు. మేళతాళాలు... కోలాటం, తప్పెటగుళ్లు... తదితర సాంస్కృతిక ప్రదర్శనల నడుమ రథయాత్ర సాగింది. అర్చకులు సుభద్ర పండా, బాలు పండా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అంతకుముందు ఇలిసిపురంలోని జగన్నాథ మందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు జగన్నాథుని దర్శించుకున్నారు.

## మూలపేట నుంచి విశాఖకు..
# గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ జాతీయ రహదారి

టెక్కలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం మూలపేట నుంచి విశాఖ జిల్లా భీమిలి వరకు గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ జాతీయరహదారికి గ్రీన్‌సిగ్నల్ పడింది. మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి తీరప్రాంత జాతీయరహదారి ఆవశ్యకత వివరించడంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. విశాఖ నుంచి భీమిలి వరకు ప్రస్తుతం జాతీయ రహదారి సౌకర్యం ఉంది. మరోవైపు భోగాపురం వద్ద ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతోంది. దీంతో మూలపేట పోర్టుకు అనుసంధానంగా ఆరు లేన్ల తీరప్రాంత జాతీయ రహదారి అవసరం ఏర్పడింది. అంతేకాకుండా పర్యావరణ ఇబ్బందులు లేని గ్రీన్ ఎక్స్‌ప్రెస్ వేగా ఉపయోగపడుతుంది. విశాఖ నుంచి మూలపేట పోర్టు వరకు తీరప్రాంత జాతీయరహదారి ఏర్పాటు చేస్తే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకి, మూలపేట పోర్టుకి కనెక్టివిటీ పెరుగుతుంది. తీరంలో పర్యాటకాభివృద్ధి చెందడంతోపాటు రిసార్ట్స్, ఆక్వా పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు పుట్టుకొస్తాయి. తీరప్రాంతంలో కోస్టల్ జాతీయ రహదారికి సంబంధించి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవ చూపుతూ కేంద్రం నుంచి అవసరమైన నిధులు విడుదలకు కృషి చేస్తున్నారు. పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కోస్టల్ జాతీయరహదారి అవసరమని పలు సమావేశాల్లో పేర్కొన్నారు. సుమారు 200కిలోమీటర్ల తీరప్రాంత జాతీయరహదారికి అవసరమైన ల్యాండ్‌ఎక్విజేషన్ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా తనకు ఇప్పటివరకు ఆదేశాలు రాలేదని, వస్తే డిటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో జిరాయితీ, అటవీ, తీరప్రాంతం స్థలాలు ఏ మేరకు అవసరమో గుర్తిస్తామన్నారు.



మూలపేట తీర ప్రాంతం



వంశధార ఎడమ కాలువ గట్టుకు రంధ్రం — 8లో

పూడ్చే పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

పెంపుడు జంతువులతో జాగ్రత్త — 7లో
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- నేడు జూనోసిస్ డే

విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి — 8లో

## కార్యకర్తలే టీడీపీకి రథసారథులు

సరుబుజ్జిలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే రథసారథులని ఎమ్మెల్యే కూన రవికుమార్, నియోజకవర్గ పరిశీలకులు వజ్జ బాబూరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల కష్టంతోనే టీడీపీ అధికారంలోకి వచ్చిందని త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఇప్పటినుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీ నాయకులు పల్లి సురేష్, కిల్లి సిద్దార్థ, నందివాడ గోవిందరావు, రాజారావు, నూక కోటేశ్వరరావు, దవల సింహాచలం, ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకర్, కాద అప్పలనాయుడు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు మొదలవలస రమేష్

ఆమదాలవలస, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్‌లో ఉన్న రైల్వే గూడ్స్‌షెడ్ హరిశ్చంద్రపురానికి తరలివెళ్లిపోతుందని చేస్తున్న అసత్య ప్రచారాలను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ మానుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గూడ్స్ షెడ్ తరలిపోతుందని అసత్య ప్రచారం చేస్తూ కూలీలు ప్రజల్లో అయోమయం సృష్టించడం తగదన్నారు. ఆయన ఏ సమాచారంతో ఇటువంటి తప్పుడు ప్రకటన చేశారో తెలపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండే ఈ ఐదేళ్లలో గూడ్స్‌షెడ్ ఎక్కడికి తరలివెళ్లదని ఒక వేళ తరలివెళితే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. లేకుంటే చింతాడ రవికుమార్ రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిలో ఎంపీ రామ్మోహన్, నియోజకవర్గ అభివృద్ధిలో కూన రవికుమార్ తనదైన ముద్ర వేస్తూ పరుగులు పెట్టిస్తుండడం చింతాడ రవికుమార్ సహించలేక ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. ఏదైనా అంశంపై మాట్లాడేటప్పుడు పూర్తి సమాచారం స్పృహతో మాట్లాడాలన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, మాజీ కౌన్సిలర్ ఇంజరాపు విశ్వనాథం, నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్, తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు బీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు, ఎరువులు అందించాలి

జి.సిగడాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కాలానికి రైతులకు అవసరమైన ఎరువులు, సాగునీరు సకాలంలో అందించాలని సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, వడిశ మహేష్, విక్రం కోటి తదితరులు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సంతవురిటి- విజయరాంపురం గ్రామాల మధ్య నిర్మాణం చేపడుతున్న బీటీ రోడ్డులో పలు చోట్ల ఉన్న పాత కల్వర్టుల స్థానంలో కొత్త కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్‌ఎంపీపీ టి.వెంకటరావు, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ, జడ్పీటీసీ కాలయ రమణ, డీటీ నిర్మల, రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ముగిసిన వారోత్సవాలు



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో ఈ నెల 3 నుంచి నిర్వహిస్తున్న అమ్మవారి జన్మ నక్షత్ర వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజున అర్చకులు మోదకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి చండీ పారాయణం, తదితర పూజలు నిర్వహించారు. 108 లీటర్లతో మహా క్షీరాభిషేకం జరిపించారు. నాగావళి నదిలో అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, డాక్టర్ లుకలాపు ప్రసన్న కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## అలరించిన సినారె గజల్ గాన లహరి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బాపూజీ కళా మందిర్‌లో శనివారం శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నెలవారి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. డా. సి.నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా గజల్ వాసుదేవ్ నిర్వహించిన సినారె గజల్ గాన లహరి కార్యక్రమం అలరించింది. అనంతరం పేదకళాకారులకు పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో పన్నాల నరసింహమూర్తి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన

కంచిలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని కాశీబుగ్గ సబ్ డివిజన్ శక్తి టీం ఎస్‌ఐ రవి, కంచిలి ఎస్‌ఐ పి.పారినాయిడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం శక్తి యాప్ వినియోగం, మహిళల భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు ఎవరికీ చెప్పరాదని సూచించారు. సిబ్బంది కేసీహెచ్ పట్నాయక్, దాస్, వాసుదేవరావు, గార వేణుగోపాల్, తిరుపతిరావు, మురళీకృష్ణ, కోదండరావు తదితరులున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని విశాఖలో జిల్లావాసి మృతి

ఎండాడ (విశాఖపట్నం), జూలై 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం సమీపంలోని ఎండాడ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందినట్టు పీఎంపాలెం స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం ఉప్పినివలస గ్రామానికి చెందిన నంబాల వెంకటరమణమూర్తి (45) భార్య, ముగ్గురు పిల్లలతో ఎన్‌ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెంలోని తారకరామా ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నారు. ఎలక్ట్రికల్ ఉద్యోగిగా విధులు నిర్వహించిన ఆయన కొన్నేళ్లుగా ఉద్యోగానికి దూరంగా ఉంటున్నారు. ఆయన భార్య సుధారాణి ఇండియన్ రైల్వేలో గుమస్తాగా పని చేస్తున్నారు. ఆర్టీవో కార్యాలయంలో వ్యక్తిగత పనుల నిమిత్తం మద్రిపాలెం ప్రాంత నివాసి, రిటైర్డు ఆడిటర్ కె.వెంకట్రావు (76)తో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ నగరానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న వెంకటరమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం వెనుక భాగంలో కూర్చున్న వెంకట్రావు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును పీఎం పాలెం స్టేషన్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పెంపుడు జంతువులతో జాగ్రత్త

● పొంచి ఉన్న వ్యాధుల ముప్పు ● నేడు జూనోసిస్ డే



ఇచ్ఛాపురం/ పలాస, జూలై 5(ఆంధ్రజ్యోతి)

పెంపుడు జంతువులతో మనం ఏర్పరచుకున్న ఆత్మీయత ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. మనుషులు.. జంతువుల మధ్య బంధం అపురూపమైనదని చెప్పవచ్చు. అయితే పెంపుడు జంతువుల పట్ల సరైన జాగ్రత్తలు పాటించకపోతే, వాటి నుంచి మనుషులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రేమ పెంచుకోవడం ఎంత అవసరమో.. తగిన జాగ్రత్తలు పాటించడం అంతే అవసరం. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయడం ద్వారా వాటి నుంచి మానవులకు వ్యాధులు రాకుండా నిరోధించవచ్చు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జంతువులు, వాటి నుంచి వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను తెలుసుకుందాం. 1885 జూలై 6న లూయి పాశ్చర్ అనే శాస్త్రవేత్త కనిపెట్టిన రేబిస్ టీకా ప్రయోగం విజయవంతమైంది. ఆ రోజున జూనోసిస్ (భారత్‌లో రేబిస్ డే) డేగా నిర్వహిస్తున్నారు.

### 250 వ్యాధులు..

మనుషుల నుంచి పశువులకు... పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులనే జూనోటిక్ వ్యాధులు అంటారు. ఇలాంటి వాటిని ఇప్పటి వరకూ 250 వ్యాధులను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించారు. ఇందులో 15 వరకూ ప్రాణాంతకమైనవని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా రేబిస్ వ్యాధి, బ్రూసెల్లోసిస్, బర్డ్‌ఫ్లూ, ఇన్‌ఫ్లూయంజా, ఆంత్రాక్స్, టీబీ, లెప్టో సిపారోసిస్ వంటివి ఉన్నాయి. ఇందులో రేబిస్ వ్యాధి అధిక శాతం కుక్కలకు వచ్చే ప్రాణాంతక వ్యాధి. దీనినే హైడ్రోఫోబియస్ అని పిలుస్తారు.

### ప్రమాదకరం.. రేబిస్

రేబిస్... ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధి. ఇది జంతువులకే కాదు. మనుషులకు వచ్చే భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధి ముదిరితే మందు లేదు. లిస్సా అనే క్రిమివల్ల రేబిస్ వ్యాప్తి చెందుతుంది. లిస్సా క్రిమి చేరిన కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి మనుషులకు, ఇతర జంతువులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధికి గురైన వ్యక్తికి జ్వరం, తలనొప్పితో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదముంది. కుక్క లా చొంగ కారడం, కంటి నుంచి నీరు కారడం, నీటిని చూసి భయపడడం, కుక్కలా మొరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధితో మనుషులైనా..జంతువులైనా మరణించే అవకాశాలు ఉన్నాయి.

● **జాగ్రత్తలు:** కుక్క కరిస్తే ఆ గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. తక్షణం వైద్యుని సంప్రదించి తగిన వైద్యసేవలు పొందాలి. జంతువులకు కుక్కలు కరిచినా ఇదే పద్ధతిని పాటించాలి. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించాలి.

● **ఆంత్రాక్స్:** ఆంత్రాక్స్ క్రిమి ఉన్న పశుమాంసం తినడం,చర్మం తీయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది.మనుషుల్లో ఈ వ్యాధి వల్ల ముఖం, చేతులు, మెడ, కాళ్లపై కార్బాన్ క్యూట్స్ వస్తాయి. జ్వరం, మెడ వాచిపోవడం, గొంతునొప్పి, దగ్గు, ఊపిరి పీల్చలేకపోవడం, నోటి నుంచి రక్తం కారడం తదితర లక్షణాలు కన్పిస్తాయి. ఆంత్రాక్స్ వ్యాధితో చనిపోయిన పశువుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. ఈ వ్యాధితో మరణించే పశువులను పది అడుగుల లోతున గోతిలో సున్నం వేసి పాతిపెట్టాలి.

● **టీకాలు వేయించాలి..**

రేబిస్ అనేది చాలా ప్రమాదం. అందుకే జాగ్రత్తగా ఉండాలి. కుక్కతో పాటు జంతువులు కరిచిన వెంటనే యాంటీ రేబిస్ ఇంజక్షన్లు వేసుకోవాలి. ప్రతి పెంపుడు జంతువుకు విధిగా యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. స్థానిక పశువైద్యశాలలో ఆదివారం టీకాలు వేస్తాం. కచ్చితంగా పెంపుడు జంతువులకు టీకాలు వేయాలి.

- అప్పలస్వామి, పశు వైద్యాధికారి, ఇచ్ఛాపురం

● **ముందు జాగ్రత్తలు పాటిస్తే మేలు..**



ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చు. జంతువులకు టీకాలు వేయడం ద్వారా వ్యాధి రాకుండా నివారించవచ్చు. ప్రతి పెంపుడు జంతువుకు టీకాలు వేయడాన్ని బాధ్యతగా స్వీకరించాలి. పశువులకు చికిత్స చేసినప్పుడు చేతికి తప్పనిసరిగా గ్లౌజ్ వేసుకోవాలి.

-డాక్టర్ రవికృష్ణ, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, పలాస

**మెదడువాపు వ్యాధి..**

పందుల నుంచి ఇది సంక్రమిస్తుంది. ఈ వ్యాధి 3 నుంచి 13 ఏళ్ల పిల్లలకు సోకుతుంది. సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

**బర్డ్ ఫ్లూ..**

ఈ వ్యాధి హెచ్-5 ఎన్-1 రకం వైరస్ వల్ల వస్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో కోళ్లలో వ్యాప్తి చెంది.. అధిక శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ వ్యాధి పక్షుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. అందుకే ముందుగానే గుడ్లు, మాంసం ఉడికించి తినడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.







శ్రీకాకుళం రూరల్: మామిడివలసలో ఎమ్మెల్యే శంకర్.. సోంపేట: ఇస్కలపాలెంలో విప్ బెందాళం అశోక్.. రణస్థలం: అవగాహన కల్పిస్తున్న ఎంపీ ఎంపీ కలిశెట్టి

## ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం..

● మంత్రి అచ్చెన్నాయుడు

● జిల్లా వ్యాప్తంగా సుపరిపాలనలో తొలిఅడుగు



కోటబొమ్మాళి: పథకాలను వివరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కటీ నెరవేరుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం చిన్నబమ్మిడి గ్రామంలో 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, నేతలు తర్ర రామకృష్ణ, పూజారి శైలజ, వెలమల కామేశ్వరరావు, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.







పోలాకి: కత్తెరవానిపేటలో ఎమ్మెల్యే రమణమూర్తి.. హిరమండలం: గులుమూరులో ఎమ్మెల్యే గోవిందరావు.. పలాస: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు

## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికే రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్థిక లోటు తీవ్రంగా ఉంది. అయినప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలనలో దూసుకుపోతున్నాం.' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన విజన్-2047 సమావేశం అనంతరం ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని, గ్రామాల్లోకి తాము వెళితే నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బ తీశారు. జగన్‌రెడ్డి పాలన అంతా అరాచకంగా సాగింది. ప్రశ్నించినందుకు అర్ధరాత్రి వేళ నన్ను అక్రమంగా అరెస్టు చేసి హింసించారు. ప్రజలు అంతా గమనించారు. అందుకే ఈ రోజు వైసీపీకి ఈ దుస్థితి. అయినాసరే రెండు రోజుల కిందట కొంతమంది వైసీపీ ప్రబుద్ధులు సమావేశం పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడారు. వారి మాటలను ఎవరు నమ్ముతారు. ఏడాదిలో మేము 64 లక్షల మంది పేదల అకౌంట్లలో రూ.32వేల కోట్లు జమచేశాం. 17వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నాం. కేవలం ఐదు రూపాయలకే అన్నా క్యాంటీన్ల ద్వారా భోజనం అందిస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద 67 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో రూ.8,700కోట్లు జమ చేశాం. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబోతున్నాం. ఇన్ని చేస్తున్నా వైసీపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. గంజాయి, మాదకద్రవ్యాల కేసుల్లో ఉన్నవారిని పరామర్శిస్తున్నారు. నీ కారు కింద వైసీపీ కార్యకర్త పడిపోతే పక్కకు తీసి పడేసి వెళ్లిపోయావు. నీకు కనీస మానవత్వం ఉందా? జగన్‌రెడ్డి. స్వేచ్ఛ ఇచ్చామని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేది లేదు' అని అచ్చెన్న హెచ్చరించారు.

## సీఎన్‌జీని సద్వినియోగం చేసుకోవాలి

అరసవల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎన్‌జీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని పౌరసరఫరాల సంస్థ పెట్రోల్ బంక్‌లో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. సీఎన్‌జీతో కాలుష్యం ఉండదని, కిలో రూ.91 రూపాయలకు లభిస్తుందని, వాహనాలకు నింపే ముందు జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవలో చంద్రన్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతాంగాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సేవగా భావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో కొత్తకోట సహకార సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గిడ్డంగి గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ.. 2019 సంవత్సరం వరకు లాభాల్లో ఉన్న కొత్తకోట సహకార సంఘాన్ని వైసీపీ పాలకులు నష్టాలోకి తీసుకెళ్లారన్నారు. ఈ గోదామును అద్దెకు అప్పగించి నిధులు సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఏపీటీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే నందికొండ ప్రాథమిక పాఠశాల నుంచి సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి బదిలీ చేసిన ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావును తిరిగి ఇదే పాఠశాలకు కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే రవికుమార్‌కు కోరారు.

## కూటమి పాలనతో వైసీపీ నేతల్లో గుబులు

కవిటి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో వైసీపీ నేతలకు గుబులుపట్టుకుందని కవిటి మండల టీడీపీ అధ్యక్షుడు పి.కృష్ణారావు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, ఎస్వీ రమణ అన్నారు. రామయ్యపుట్టుగలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతలకు రాష్ట్రంలో పరిపాలన చూస్తుంటే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. పార్టీ కార్యక్రమానికై సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులే ఇందుకు నిదర్శనంగా ఉన్నాయన్నారు. వైసీపీ పాలనలో హామీలను మరచిపోయి రాష్ట్రాన్ని నాశనం చేసి ఇప్పుడు ప్రగల్భాలు పలకటం తగదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కుటిల రాజకీయాలు మానుకోవాలన్నారు.

## టీడీపీ నూతన కార్యవర్గం

సరుబుజ్జిలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల తెలుగుదేశం పార్టీ కార్యవర్గాన్ని శనివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడుగా అంబళ్ల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల తెలుగు యువత అధ్యక్షుడిగా దవల సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఇల్లాకుల ప్రభాకర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కందుల వెంకటరావు, మహిళా అధ్యక్షురాలిగా కొర్ను జగన్మోహిని, తెలుగు రైతు అధ్యక్షుడుగా చిన్నాల అప్పారావులను ఎన్నుకున్నారు. మండల తెలుగుదేశం పార్టీకి చెందని వివిధ విభాగాలకు కార్యవర్గాన్ని ఎన్నుకొని వీరందరినీ ఎమ్మెల్యే రవికుమార్ అభినందనలు తెలిపారు.

## 15 పశువులు స్వాధీనం

రణస్థలం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి అలమండ సంతకు అక్రమంగా లారీపై తరలిస్తున్న ఏడు గేదెలు, ఎనిమిది పోతులను పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద శనివారం పట్టుకున్నట్టు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. పశువులు తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## కూటమి నాయకుల పరామర్శ

జి.సిగడాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): నిద్దాం గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రవికుమార్ తల్లి సత్యవతి శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, బూపతి అర్జున్‌కుమార్, టంకాల మౌళీశ్వరరావు, పైల విష్ణుమూర్తి శనివారం రవికుమార్‌ని పరామర్శించారు. వీరి వెంట వజ్జపర్తి రఘురాం, కె.వెంకటరావు, మహదాశ్యం చిన్నారావు, పి.బంగారినాయుడు, వీవీ గోపాలరావు పాత్రో, మజ్జి కన్నంనాయుడు, గొల్లాజీ తదితరులు ఉన్నారు.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా బొడ్డేపల్లి

ఆమదాలవలస, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పట్టణానికి చెందిన బొడ్డేపల్లి రమేష్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గంలో రమేష్‌కుమార్‌ను రాష్ట్ర పార్టీకి ఎంపిక చేయడంపై పట్టణానికి చెందిన వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో తనకు స్థానం కల్పించినందుకు పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు, రాష్ట్ర, జిల్లా వైసీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





## గ్రీవెన్స్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రారంభించిందని, ఏమైనా సమస్యలు ఉంటే ఆర్‌ఎస్‌కేల ద్వారా నమోదు చేసుకోవచ్చునని తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఏవో అజయ్ కుమార్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ పోర్టల్‌పై వీఏఏలు, వీఆర్‌వోలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించారు. వీఏఏలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు

## బెంకిలిలో కార్డెన్ సెర్చ్

సోంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): బెంకిలి గ్రామంలో ఎస్‌ఐ లవరాజు ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన డాక్యుమెంట్లు లేని ఏడు వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు.

## అలరించిన సంగీత కచేరి

సోంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్రలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శనివారం సంగీ కచేరీ నిర్వహించారు. మాస్టర్ తెలుకుల, ఆధ్వర్యంలో ఈపరి పూర్ణచంద్రిక, దున్న వానవి, ఉట్ల రాంప్రసాద్, సచల, చెవిటి జనని ఆధ్వర్యంలో నిర్వహించిన కచేరీ పలువురిని ఆకట్టుకుంది.

## అగ్నిమాపక కేంద్ర భవనానికి శంకుస్థాపన

సోంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక కేంద్ర నూతన భవనానికి ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శనివారం శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవనం పూర్తయితే అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందులు తప్పుతాయన్నారు. అగ్నిమాపక జిల్లా అధికారి జి.మోహనరావు, అదనపు జిల్లాఅధికారి కె.శ్రీనుబాబు, ఎస్‌ఎఫ్‌వో బి.సూర్యారావు పాల్గొన్నారు

## శ్రీ చైతన్య కళాశాలలో అగ్నిప్రమాదం

● త్రుటిలో తప్పిన ముప్పు



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ప్యానెల్ బాక్సు

శ్రీకాకుళం క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న శ్రీ చైతన్య కళాశాల భాను టవర్స్ బ్రాంచ్‌లో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. కళాశాల గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ ప్యానెల్ బాక్సు వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అది గమనించిన కళాశాలలో పనిచేస్తున్న ఓ అధ్యాపకురాలు చాకచక్యంగా వ్యవహరించి మెయిన్ బాక్సు వద్ద ఉన్న మెయిన్ స్విచ్ ఆపి వేయడంతో మంటలు వ్యాపించకుండా నివారించగలిగారు. ఇదేక్రమంలో మరికొందరు సిబ్బంది స్పందించి ఇసుక బకెట్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ కళాశాలలో సుమారు 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. మంటలు ఎక్కువగా చెలరేగితే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ఆస్తినష్టం జరగలేదని అగ్నిమాపకశాఖ ఏడీ శ్రీనుబాబు తెలిపారు.

## ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి సస్పెన్షన్

టెక్కలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వి.నానిబాబు నెలవారీ డిపోలకు ఇచ్చే సరుకులను సకాలంలో సరఫరా చేయని కారణంగా సస్పెండ్ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలి మండలంలో 50, నందిగాం మండలంలో 48, వజ్రపుకొత్తూరు మండలంలో రెండు చౌకధరల దుకాణాలకు సుమారుగా ఆరువేల టన్నుల బియ్యం, 18 టన్నుల పంచదార పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో ఈ సస్పెన్షన్ వేటు వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నానిబాబు స్థానంలో డీటీ అనిల్ కుమార్ పాత్రోకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వంశధార ఎడమ కాలువ గట్టుకు రంధ్రం

హిరమండలం, జూలై 5(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ ఎడమ కాలువ కుడి గట్టుకు రంధ్రం పడింది. శుక్రవారం రాత్రి రెల్లివలస గ్రామ సమీపంలో మజ్జిగూడేం 5.71 కిలోమీటర్ వద్ద కాలువకు ఏర్పడిన రంధ్రం ద్వారా వంశధార నీరు బయటకు వచ్చి పంట పొలాల్లోకి చేరడం తో ఆయకట్టు రైతులు గుర్తించారు. వెంటనే వంశధార అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈఈ సీతారాంనాయుడు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శనివారం పరిశీలించి రంధ్రాన్ని పూడ్చే పని చేపట్టారు. ఈ నేపథ్యంలో కాలువకు నీటి విడుదలను నిలిపి వేశారు. రంధ్రం పూడ్చే పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా సాగునీటిని విడిచి పెడతామని ఈఈ చెప్పారు. ఎలుకలు గట్టుకు రంధ్రం పెట్టి ఉండవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాగా కాలువ లో ప్రస్తుతం 650 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టినప్పటికే గట్టుకు రంధ్రాలు పడుతూ నీరు బయటకు వస్తోందని, 2000 క్యూసెక్కులు నీటిని విడిచిపెడితే పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. రంధ్రం పూడ్చే పనులను అంబావల్లి నీటి సంఘం అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, డీఈ సరస్వతి, ఏఈ ధనుంజయరావు, బ్యారేజీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పలాస, జూలై 5(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏడీ కుమార్, కణితి దశరథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం డిపో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిస్పెన్సన్లు బదిలీలపై విల్లింగ్ మేరకు పర్మనెంట్ బదిలీలు ఇవ్వాలన్నారు. డబల్ డ్యూటీ చేసిన వారికి డీఏ పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నేత జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్యామ్ శస్త్ర చికిత్సకు దాతల సాయం



శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న శ్యామ్ చరణ్

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట శివారులో శుక్రవారం ఆటో టైర్ పేలి బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఈదులవలస మోడల్ పాఠశాల ఆరోతరగతి విద్యార్థి ఎస్.శ్యామ్‌చరణ్ శస్త్రచికిత్స కోసం దాతలు సాయమందించారు. ఈ ప్రమాదంలో శ్యామ్ కుడి తొడ ఎముక, కాలర్‌బోన్, ఎడమచేయి మడం వద్ద విరిగిపోగా తలపై బలమైన గాయాలయ్యాయి. తొలుత శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్చి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న నరసన్నపేటకు చెందిన ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ దాతలను సంప్రదించి రూ.1.25 లక్షలు సేకరించి శనివారం బాధితుడి కుటుంబానికి అందించారు. వెంటనే ఆపరేషన్ చేయడంతో బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. చరణ్ చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా కొంత సాయం చేశారు. చరణ్ తండ్రి నాగరాజు ఉపాధి కోసం 15 రోజులు కిందట దుబాయ్ వెళ్లారు. తల్లి మీనా పిల్లల చదువుకోసం నరసన్నపేట ఇందిరానగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరి స్వగ్రామం సంతబొమ్మాళి. కుమారుడిని ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు కృషి చేసిన దాతలకు, వైద్యులకు తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

## ఒక విద్యార్థి.. ఒక గురువు

(ఐదో పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడితో పాఠశాలను నెట్టుకొస్తున్నారు. ఈ గ్రామంలో 40 నుంచి 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. కానీ, వీరంతా జాడుపుడి, సోంపేట, కంచిలి తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పించే విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మాకు ఆ అధికారం లేదు..**

విద్యార్థులు సంఖ్య తక్కువ ఉందని ఫౌండేషన్ స్కూళ్లను మూసివేసే అధికారం మాకు లేదు. పాఠశాలలను ప్రారంభించడం.. మూసివేయడం అనేది ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. అధికారుల చేతుల్లో ఏమీ ఉండదు.

**-బి.మాధవరావు, మండల విద్యాశాఖ అధికారి, జలుమూరు**

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4

(ఐదో పేజీ తరువాయి)

ఎనిమిది నియోజకవర్గాల్లో ఆయా శాసనసభ్యుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీలను ఆమోదించారు. ఆయా కమిటీల కార్యాలయాలను నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. కార్యక్రమంలో ఆమదాలవలస, నరసన్నపేట ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి పాల్గొని పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎనిమిది నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వారాహి అమ్మవారికి పూజలు

టెక్కలి, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై అర్చకుడు తర్లా శివకుమార్ ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

టెక్కలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను రెండు బెంచ్‌లలో సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల, జూనియర్ న్యాయాధికారి యు.నిర్మల నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సివిల్, 54 క్రిమినల్, ఏడు ఎక్సైజ్, మనోవర్తి, బ్యాంక్ రికవరీ కేసులు ఒక్కొక్కటి పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, అదాలత్ సభ్యులు దివాకర్, రమణారావు, శ్రీనివాసరావు, లీగల్ వలంటీర్ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



టెక్కలి: జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల



పలాస: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి మాధురి

### లోక్‌అదాలత్‌లో 248 కేసుల పరిష్కారం

పలాస, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిఫ్ న్యాయాధికారి యు.మాధురి మాట్లాడుతూ.. అనేక కక్షిదారుల సమస్యలు పరిష్కారమయ్యావన్నారు. 98 క్రిమినల్, 4 సివిల్, 146 నేరం అంగీకారం కేసులు పరిష్కారమయ్యావన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్‌అహ్మద్, ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్, జీఎంఎస్ అనిల్‌రాజు, అదాలత్ సభ్యుడు జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### నరసన్నపేటలో 155..

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను భాగంగా నరసన్నపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 155 కేసులను ఇరు పక్షాల అంగీకారంతో పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి తెలిపారు. సత్వర న్యాయంకోసం లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీ గొండు సత్యనారాయణ, బార్ అసోయేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, న్యాయవాదులు ఆర్కె నాయుడు, జీవీజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కోటబొమ్మాళిలో 152..

కోటబొమ్మాళి, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 152 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు సిబ్బంది తెలిపారు. వీటిలో సివిల్ నాలుగు, ఎగ్జిక్యూషన్ పిటిషన్ ఒకటి, రెండు చెక్ బౌన్స్‌లు, 25 క్రిమినల్, ప్లీ బార్గైనింగ్ 35, క్రిమినల్ అడ్మినిషన్స్ కేసులు 85 పరి ష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు వెలమల అప్పలనాయుడు, పి.అర్జున రావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్. శ్రీనివా సులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### పాతపట్నంలో 169..

పాతపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం కోర్టు పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి నిర్వహించారు. ఈ సందర్భంగా 169 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు 18, ప్రోనోట్ కేసులు 3, భార్యా భర్తల తగాదాలు 7, ప్రొహిబిషన్ ఎక్సైజ్ కేసులు 26, న్యూసెన్స్ పేకాట కేసులు-115 పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో పోలీస్, ప్రొహిబిషన్, ఎక్సైజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఇచ్ఛాపురంలో 139..

ఇచ్ఛాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించు కోవచ్చని జూనియర్ సివిల్ న్యాయాధికారి పరీక్షకుమార్ అన్నారు. శనివారం మున్సిఫ్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 139 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్ఐలు ముకుందరావు, శ్రీనివాసరావు, న్యాయవాదులు యు.భారతి దివ్య, రమణయ్యరెడ్డి, రాంబాబు, రంగారావు, వేణు, కామేష్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

### పొందూరులో 303..

పొందూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 303 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమయం, డబ్బు వృథా కాకుండా ఉండాలంటే లోక్‌అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందాలన్నారు. న్యాయవాదులు కె.రమణమూర్తి, కె.మంజుల, బ్రహ్మాజీ, సురేష్, కిరణ్, రమణమూర్తి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మనోవర్తి మొత్తాన్ని అందిస్తున్న న్యాయాధికారి పరీక్షకుమార్







నరసన్నపేట, కోటబొమ్మాళి, పొందూరులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారులు వాణి, రోషిణి, జ్యోత్స్న

# ఘనంగా మారు రథయాత్ర

జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా శనివారం మారు రథయాత్ర భక్తుల ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. గడచిన 9 రోజులుగా గుడించా మందిరంలో వివిధ అవతారాల్లో దర్శనమిచ్చిన జగన్నాథుడు సుభద్ర, బలభద్రుల సమేతంగా రథంలో తిరిగి ఆలయాలకు చేరుకున్నాడు.

**-ఆంధ్రజ్యోతి బృందం**





టెక్కలి, పలాసలో మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు



పలాస రూరల్: తర్లాకోటలో రథంపై జగన్నాథుడు





జలుమూరు, పాతపట్నంలో స్వామివారి రథం లాగుతున్న భక్తులు



హరిపురం: సాబకోటలో ..



ఇచ్ఛాపురం: మారు రథయాత్రలో పాల్గొన్న భక్తజన సందోహం



కవిటి: స్వామివారి ఊరేగింపు



ఎల్ఎన్‌పేట: కల్కి అవతారంలో





కాశీబుగ్గ, నరసన్నపేటల్లో ధర్నాలు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

## పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి

కాశీబుగ్గ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఉపసహరించు కోవాలని, అదానితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేయా లన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొ న్నారు.

● నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులపై ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిన భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో శనివారం నిరసన చేపట్టారు. పేదలపై విద్యుత్ భారాలను మోపడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్.మధుసూదనరావు, భాస్కరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

## పాఠశాల బియ్యంలో పురుగులు



బసివలస పాఠశాలకు పంపిణీ చేసిన సన్నబియ్యంలో తెల్లని పురుగులు

నరసన్నపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు జూలై నెలలో పంపిణీ చేసిన సన్నబియ్యంలో సుంకి పురుగులు, సాగే పురుగులు, నూకలు ఎక్కువగా ఉన్నాయి. శనివారం బసివలస పాఠశాలకు పంపిణీ చేసిన బియ్యంలో సాగే పురుగులు కనిపించాయి. దీంతో హెచ్ఎం బాబూరావు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. మరికొన్ని పాఠశాలలకు పంపిణీ చేసిన బియ్యంలోనూ తెల్లని సాగే పురుగులు, సుంకి పురుగులు కనిపిస్తున్నాయని హెచ్ఎంలు చెబుతున్నారు. వెంటనే బియ్యాన్ని మార్చాలని... పురుగుల బియ్యంతో విద్యార్థులకు భోజనాలు ఎలా పెడతామని ఎండీఎం నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై హెచ్ఎంల నుంచి బియ్యంపై వివరాలను సేకరించి సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు.

## దేవాలయాలకు ఈవోల నియామకం

మందస, జూలై 5(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని దేవాలయాలను విభజించి ఇద్దరు ఈవోలను నియమించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పది దేవాలయాలకు ఎస్.నాగేశ్వ రరావు, మరో పది దేవాలయాలకు సీహెచ్ ప్రభాకరరావులను నియమించగా వారు శనివారం బాధ్యతలు చేపట్టారు.

వీరు శ్రీముఖలింగం నుంచి రాగా, ఇక్కడ పని చేసిన వాసుదేవరావు శ్రీముఖలింగానికి బదిలీ అయ్యారు.

## పేదరికం లేని సమాజానికి కృషి: బగ్గు

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం సృష్టించేందుకు సీఎం చంద్రబాబునాయుడు పీ-4 కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజవర్గ స్థాయి విజన్ యాక్షన్‌పై నాలుగు మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీపీఎల్ కుటుంబాల గుర్తింపులో ఎటువంటి సిఫార్సులు లేకుండా అసలైన పేదలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, డా.నిక్కు పద్మావతి, ధర్మాన తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ తనిఖీ

హిరమండలం, జూలై 5(ఆంధ్రజ్యోతి): హిరమండలం పెద్ద కోరాడ వీధిలో ఉన్న గ్యాస్ గోడౌన్‌ను తహసీల్దార్ హనుమంతురావు శనివారం తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా గోడౌన్ నిర్వహిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు.

**న్యూస్ బాక్స్**

## నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్నందున ఆది, సోమవారాల్లో వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, డీఈఈ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం గ్రామాల్లోను, సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంగుడి, సరాళి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**రేపు ఉర్లాం సబ్ స్టేషన్ పరిధిలో..**

నరసన్నపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ చోడవరం ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు, నరసన్నపేట ఏఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలైన్లు వేసేందుకు గానునడగాం నుంచి సుందరాపురం వరకు అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**పార్వతీశంపేటలో రేపు..**

ఆమదాలవలస, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్వతీశంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కృష్ణాపురం ఫీడర్ పరిధిలో ఉన్న 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్‌ను వేరొక చోటకు మార్చనున్నందున సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ పైడి యోగేశ్వరరావు పేర్కొన్నారు. దీంతో ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పార్వతీశం పేటకు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## కార్గో ఎయిర్ పోర్టును వ్యతిరేకించాలి

వజ్రపుకొత్తూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉద్దాన ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా శనివారం ఒంకులూరు సంఘ భవనంలో లక్ష సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ.. పచ్చని ఉద్దానంలో సుమారు పద్నాలుగు వందల ఎకరాల భూసేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

నందిగాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా)ను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ కె.జగన్ మోహనరావు అన్నారు. శనివారం నంది గాం-1లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో పి.శ్రీకాంత్ వర్మ, ఏఈవో టి.వాసవి, నందిగాం నీటి సంఘం అధ్యక్షుడు కె.జయరాం, అభ్యుదయ రైతు పి.రవికుమార్, రైతులు పాల్గొన్నారు.